# కోటిని తాకనున్న భక్తుల రాక

## -దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా మేడారం

**భక్తుల సముద్రంగా మేడారం**

**శాశ్వత అభివృద్ధికి ప్రభుత్వ కార్యాచరణ**

**మేడారం జాతరలో రికార్డు రద్దీ**

**కోటికి చేరనున్న దర్శనాలు**

**దక్షిణ భారత కుంభమేళాగా మేడారం**

**శాశ్వత సౌకర్యాల దిశగా అడుగులు**

**భక్తుల తాకిడితో ఉప్పొంగిన మేడారం జాతర**



**మేడారం హనుమకొండ బ్యూరో జనవరి29 (జర్నలిస్ట్ వార్త):** మేడారం సమ్మక్కసారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గురువారం వరకు దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటిని మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు.
తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోందని స్పష్టం చేశారు.మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించామని, మరో 41 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో నివాస గృహాలు, సమావేశ భవనాలు, మరుగుదొడ్లు, స్నాన గదులు నిర్మించనున్నట్లు వివరించారు.
దక్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యతను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి భారీ ప్రణాళిక అమలులో ఉందని తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు వెల్లడించారు.జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రామప్పలక్నవరం నుంచి జంపన్న వాగు వరకు నీటిని తరలించే ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రకటించారని, వాగుపై చెక్‌డ్యామ్‌లు నిర్మించి శాశ్వత నీటి నిల్వకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు.మేడారం ప్రాంతానికి ఇప్పటికే సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, దాని ప్రకారం అంతర్గత రహదారుల అభివృద్ధి, పర్యావరణ పార్కుల ఏర్పాటు, పర్యాటక సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు.




ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం రెండు రోజుల్లోనే 70 నుంచి 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని తెలిపారు.గతంలో ఇరుకైన రహదారుల వల్ల ఇబ్బందులు ఉండేవని, ఈసారి విశాల రహదారుల కారణంగా రాకపోకలు సులభమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో శాశ్వత తాగునీటి వ్యవస్థతో పాటు భారీ సంఖ్యలో శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం అవసరమని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విస్తృతంగా చెట్ల పెంపకం చేపట్టనున్నట్లు చెప్పారు.జాతరను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికార యంత్రాంగం, మీడియా ప్రతినిధులకు సీతక్క అభినందనలు తెలిపారు

# మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు భారీ షాక్

## బిఆర్ఎస్‌లోకి ఐదో వార్డు కాంగ్రెస్ నాయకుడు నేతావత్ రాజేందర్ చేరిక



**రాయపర్తి(వర్ధన్నపేట)/జనవరి 29 (జర్నలిస్ట్ వార్త):** మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీకి వర్ధన్నపేటలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని డీసీ తండా ఐదో వార్డు కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడు నేతావత్ రాజేందర్ కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరారు.
మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ సమక్షంలో రాజేందర్ బిఆర్ఎస్ పార్టీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా నేతావత్ రాజేందర్ మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు, నాయకత్వంపై నమ్మకంతోనే పార్టీలో చేరినట్లు తెలిపారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో ఐదో వార్డు కౌన్సిలర్‌గా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తుల కుమార్, సారంగపాణి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రిస్టియన్ సోదరుల ఆశలకు చేయూత

## చర్చి నిర్మాణానికి 50 వేల విరాళం



**రాయపర్తి/జనవరి 29 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని పేరికెడ్ గ్రామంలో క్రిస్టియన్ సోదరుల కోరిక మేరకు చర్చి నిర్మాణ పనులకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి రూ.50,000లను విరాళంగా అందించి మానవతా సేవకు నిదర్శనంగా నిలిచారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని, మతభేదాలకు అతీతంగా అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గ్రామాల్లో సామాజిక ఐక్యతను బలోపేతం చేసే కార్యక్రమాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో లేతాకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, గజవెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి, చందు రాము, భాషబోయిన ఎల్లయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మెర విరస్వామి, మాజీ సర్పంచ్ చిన్నాల రాజబాబు, మాజీ ఎంపీటీసీ బండి రాజబాబు, భాషబోయిన సుధాకర్, మంగిశెట్టి రాజు, ఆకారపు దేవేంద్ర చారి, మాకినేని కిట్టారావు, ఆకుల సమ్మయ్య, బండి నరసయ్య, బొమ్మెర రాజు, ఉగ యాకుబ్, ఉగ మల్లెయ్య, పండుగ రామానుజం, ఉగ సతీష్, ఉగ ఉమేష్, ఉగ రాజు తదితరులు పాల్గొన్నారు.

# దాగి ఉన్న ప్రతిభకు వెలుగు

## ధర్మసాగర్‌లో సీఎం కప్2025 క్రీడా సంబరం





**ధర్మసాగర్ /జనవరి హనుమకొండ జిల్లాలో 29 జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్2025 కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ మండల స్థాయి క్రీడా ఎంపికలు గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి.
గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి తెలిపారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యంగా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.



మండల స్థాయి ఎంపికల్లో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, కరాటే, ఖోఖో, వాలీబాల్, యోగ వంటి విభిన్న క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. ఎంపికైన క్రీడాకారులు తదుపరి దశగా నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడా ఎంపిక పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని మండల క్రీడా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ క్రీడా ఎంపికల ద్వారా రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా ఎదగడానికి మంచి అవకాశాలు లభిస్తాయని వారు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ గ్రామ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుడు సాంబరాజు, మండల క్రీడా కమిటీ చైర్మన్ అఫ్జల్, కన్వీనర్ డాక్టర్ బి. రామ్‌ధన్, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పి. మైసయ్య, మండల సీఎం కప్ ఇన్‌చార్జి ఆర్. రమేష్, ధర్మసాగర్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. మురళి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మండలంలోని ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న శారీరక విద్య ఉపాధ్యాయులు శైలేందర్, రమేష్, సురేష్, శ్రీనాథ్‌లు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల బరిలో కాంగ్రెస్ అభ్యర్థిగా దొమ్మటి స్వాతి



**వర్ధన్నపేట/జనవరి 29 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మున్సిపాలిటీలో రాజకీయ వేడి రాజుకుంది. ఈ సందర్భంగా వర్ధన్నపేట మున్సిపాలిటీ 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దొమ్మటి స్వాతి గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులే తమను విజయపథంలో నడిపిస్తాయ ధీమా వ్యక్తం చేశారు. మద్దతుదారులు, పార్టీ కార్యకర్తల మధ్య ఆమె నామినేషన్ దాఖలు చేశారు. వార్డు అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తానని, ప్రజా సేవలో ముందుంటానని హామీ ఇచ్చారు.

# వనంనుండి గద్దెకు చేరుకున్న శ్రీ సమ్మక్క తల్లి

## ... శ్రీ సమ్మక్క సారలమ్మలకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు



**స్టేషన్ ఘన్పూర్/జనవరి29 (జర్నలిస్ట్ వార్త);** మండలంలోని తాటికొండ, జిట్టెగూడెం గ్రామ పంచాయతీల పరిధిలో మల్లన్న గండి రిజర్వా యర్ వద్ద, మండలంలోని ఇప్పగూడెం, చిల్పూర్ మండలంలోని గార్లగడ్డ తండా- ఫతేపూర్, శ్రీపతి పెల్లి- కొండాపూర్, లింగంపల్లి, చిల్పూర్ గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న శ్రీ సమ్మక్క- సారల మ్మ జాతర గురువారం రోజున రాత్రి వనం నుండి జనంలోకి సమ్మక్క తల్లిని అంగరంగ వైభవంగా, డప్పు చప్పులతో, బ్యాండ్ మేలాలతో కోయ పూజారులు సమ్మక్క తల్లిని గద్దె పైకి తీసుకువ చ్చి పూజలు నిర్వహించారు. సమ్మక్క తల్లి గద్దె కు వచ్చే సమయంలో చిలకలగుట్ట నుండి జాతర ప్రాంగణం వరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీ సమ్మక్క సారలమ్మలనుదర్శించుకుని మొక్కులు చెల్లించు కున్నారు. జాతర ప్రాంగణంలోనే గుడారాలు వేసుకొని అక్కడే వంటలు చేసుకుని కుటుంబ సభ్యులతో అక్కడే రెండు రోజుల పాటు ఆనం దంగా గడిపారు. భక్తుల సౌకర్యార్థం వివిధ రకాల దుకాణాలు జాతరప్రాంగణంలో వెలిసాయి. భక్తు లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్ లు, జాతర చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, వివిధ పార్టీల నాయకు లు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ముంగిటే అభివృద్ధి డ్రామా..

## ప్రజల్ని మరోసారి మోసం చేయడానికేనా..?

**సత్తుపల్లి/జనవరి 29 (జర్నలిస్ట్ వార్త):** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవగానే ఇప్పటివరకు గుర్తుకురాని అభివృద్ధి పనులు ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీకి గుర్తుకువచ్చాయా..? అంటూ సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరించిన పాలకులు, ఇప్పుడు ఎన్నికల వేళ హడావుడిగా అభివృద్ధి పనుల పేరుతో ప్రజలను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని భారతీయ జనతా పార్టీ నాయకులు విమర్శించారు.
గుంతలతో నిండిన రోడ్లకు తాత్కాలిక మరమ్మత్తులు, డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, బస్తీల్లో నీటి ట్యాంకుల ఏర్పాటు, నీళ్ల సరఫరా వంటి కార్యక్రమాలు ఎన్నికల సమయం రాగానే మొదలుపెట్టడం వెనుక స్పష్టమైన ఓటు బ్యాంకు రాజకీయాలే ఉన్నాయని ఆరోపించారు. ఇన్నాళ్లూ ప్రజలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఓట్ల కోసం అభివృద్ధి నాటకాలకు తెరలేపిందని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఉన్న సమస్యలనే ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని తెలిపారు. ప్రజలకు అందవలసిన కనీస మౌలిక సదుపాయాలు కూడా సమర్థంగా అందించలేకపోయిందని విమర్శించారు.



ఈ పరిస్థితుల్లో సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో భారతీయ జనతా పార్టీ అన్ని వార్డుల్లో పోటీ చేయనున్నట్లు బీజేపీ నాయకులు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో సాధ్యమైనంత ఎక్కువ వార్డులు గెలిచి ప్రజల తరఫున బలమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.
ఈ రోజు కల్లూరు మున్సిపాలిటీలోని సత్తుపల్లి పట్టణంలో ఆరు వార్డులకు బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. మిగిలిన వార్డులకు రేపు నామినేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు.
ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, జిల్లా ఎన్నికల కన్వీనర్ దొంగల సత్యనారాయణ, కో-కన్వీనర్ వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, సత్తుపల్లి ప్రభారి పడిగల మధు, పట్టణ, మండల అధ్యక్షులు బానోత్ విజయ్, సాలి శివ, జిల్లా కార్యదర్శి సురేందర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జొన్నలగడ్డ నరేష్, సీనియర్ నాయకులు దొడ్డపనేని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

